దివ్యాంగులపై దయలేదా..?

- పునరావాస కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు
- పింఛన్ కట్ చేసిన ప్రభుత్వం
- 36 నెలలుగా అందని పింఛన్
- ఇబ్బందుల్లో కార్యకర్తలు, సీఆర్పీలు

కోనరావుపేట: శారీరక, మానసిక వికలాంగులకు పురావాసం కల్పించి, వారికి వివిధ రకాల థెరపీలు, వ్యాయామం, ప్రత్యేక విద్యలో శిక్షణ ఇప్పించేందుకు వికలాంగుల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో తాత్కాలిక పద్ధతిలో సేవాభావంతో కార్యకర్తలు, సీఆర్పీలు కొద్దిపాటి వేతనంతో పనిచేస్తున్నారు. వారికి జీతం అందిస్తున్నామని భావించిన ప్రభుత్వం దివ్యాంగులకు అందించే పింఛన్ నిలిపివేసింది. దీంతో వారు అరకొర వేతనంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు.



పునరావాస కేంద్రంలో ఉన్న దివ్యాంగులు

నిరంతర సేవలు..

పునరావాస కేంద్రాల్లో ఓ కార్యకర్త, ఈఐ సీఆర్పీ పనిచేస్తున్నారు. కార్యకర్త పునరావాస కేంద్రానికి వచ్చే దివ్యాంగుల ఆలనా పాలనా చూసుకుంటోంది. వారికి కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలో వివరించి, శారీరక వికలాంగులకు ఫిజియోథెరపీ, మాటలు రానివారికి స్పీచ్ థెరపీ చేయిస్తుంది. ఈ సీఆర్పీ పునరావాస కేంద్ర పరిధిలో 0–6 ఏళ్ల లోపు దివ్యాంగులైన చిన్నారులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ లాంటివి చేయిస్తుంది. అంతేగాకుండా వారిని ఆస్పత్రికి తరలించడంలో సహాయకారిగా పనిచేస్తుంది. అవసరమున్న పరికరాలు ఇప్పించడంలో అధికారులకు, దివ్యాంగులకు అనుసంధానకర్తగా పనిచేస్తుంది.

అరకొర వేతనాలతో ఇబ్బందులు

దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త, సీఆర్పీలు అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేసిన సేవలకు రూ. 5 వేలు అందిస్తున్నారు. వీటికి తోడు వికలాంగుల పింఛన్ మరో రూ.3,016 వచ్చేవి. ఇవన్నీ సరిపోకపోయినా భారంగా గడుపుతున్నారు. దీనికి తోడు వచ్చే పింఛన్‌ను కూడా బంద్ చేయడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు.



వికలాంగుల పునరావాస కేంద్రం

మూడేళ్ల నుంచి అందని పింఛన్

ఇలాంటి దివ్యాంగుల పునరావాస కేంద్రాలు రాష్ట్రంలో మొత్తం 76 ఉండగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు పనిచేస్తున్నాయి. ప్రతి సెంటర్‌లో ఓ కార్యకర్త, ఓ సీఆర్పీ పనిచేస్తుంటారు. వీరందరికీ 2020 జనవరి నుంచి దివ్యాంగుల పింఛన్‌ను బంద్ చేశారు. మూడేళ్ల నుంచి పింఛన్ రాకపోవడంతో వారు ఇక్కట్లు పడుతున్నారు.

పింఛన్‌ను పునరుద్ధరించాలి



కొన్నేళ్ల నుంచి పునరావాస కేంద్రాల్లో ఇచ్చే అరకొర వేతనాలకు పనిచేస్తున్నా. అధికారులు ఇచ్చే రూ.5 వేలు ప్రస్తుత రోజుల్లో ఏమాత్రం సరిపోకపోయినా సేవాభావంతో పనిచేస్తున్నా. ఇప్పుడు పింఛన్ కట్ చేయడం ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి దివ్యాంగుల పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– రొడ్డ సత్తవ్వ, కార్యకర్త

అరకొర వేతనాలకు పనిచేస్తున్నాం



నేను కోనరావుపేట మండల కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పనిచేస్తున్నాను. అధికారులు అందించే రూ.5 వేలు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.3,016 పింఛన్ కొంతమేర ఆసరాగా ఉండేది. ఇప్పుడు అదికూడా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– అక్కెనపల్లి రజిత, సీఆర్పీ

ప్రభుత్వం నిలిపివేసింది



కార్యకర్తలకు, సీఆర్పీలకు ప్రతినెల వచ్చే వికలాంగుల పింఛన్ నిలిపివేసినట్లు తెలిసింది. వారు తక్కువ వేతనానికి పనిచేస్తున్నా, ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు పింఛన్ నిలిపివేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించి వారి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తా.

– దేవరాజు, ఏపీఎం

క్లుప్తంగా

ఆత్మనిర్భర భారత్‌పై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 19వ వార్డులో చేపట్టిన ఆత్మనిర్భర భారత్‌పై మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వార్డును ఆత్మనిర్భర్ భారత్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజలు తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు. స్వచ్ఛ సిరిసిల్లలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న స్రవంతి

ఎల్లారెడ్డిపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని వైద్యాధికారి స్రవంతి అన్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో కంటి వెలుగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామంలో 12 వేల జనాభా ఉన్నారని, వీరిలో 18 ఏళ్లు నిండిన వారి నుంచి ప్రతి ఒక్కరూ కంటి వెలుగులో కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మొదటి రోజు వంద మందికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఉసర్పంచ్ రజిత, నాయకులు బాల్‌రాజ్, అఫ్జల్, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు, ఏఎస్ఎంలు, పాల్గొన్నారు.

రేషన్ షాప్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మూడేళ్ల పాటు దేశంలోని తెల్లరేషన్ కార్డుదారులందరికీ ప్రధాని మోదీ మూడేళ్ల పాటు ఉచిత రేషన్ ఇస్తామని చెప్పారని, కాని సీఎం కేసీఆర్ మాత్రం ప్రజలకు ఇవ్వాల్సిన ఉచిత రేషన్ ఇవ్వడం లేదంటూ బీజేపీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని నిరుపేద ప్రజలను సీఎం కేసీఆర్ పండుగ పూట పస్తులుంచుతున్నారన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు వెంటనే రేషన్ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వామి, రంజిత్, సంతోష్, రాజు, హరీశ్, శ్రావణ్, లక్ష్మణ్, శ్రీకాంత్, అనీల్, చంద్రం పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



ఎల్లారెడ్డిపేటలో తాళిబొట్టు చూపుతున్న పండితులు



సిరిసిల్లటౌన్ విద్యానగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి: : జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ అభయాంజనేయ స్వామి, ముస్తాబాద్ మండలం గూడెం శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి, పోతుగల్ శ్రీసీతారామచంద్రస్వామి, ఎల్లారెడ్డిపేట శ్రీవేణుగోపాలస్వామి, చందుర్తి మండలం బండపెల్లి గ్రామంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయాల్లో శ్రీగోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఆలయాలలో ప్రత్యేక పూజల అనంతరం స్వామి ఎదుర్కొళ్లు నిర్వహించారు. గూడెంలో శ్రీవారికి సర్పంచ్ చిట్నేని సరిత, ఎంపీటీసీ శ్రీధర్ పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



ఎల్లారెడ్డిపేట: మండలం సింగారంలో రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ భాస్కర్‌గౌడ్, సర్పంచ్ సర్సాగౌడ్, ఉపసర్పంచ్ ఉస్మాన్, ఎంపీటీసీ మధు, నాయకులు పాల్గొన్నారు.

చిత్రకథ



మొక్కలు ఎండుతున్నా పట్టింపు లేదా..?

వేములవాడరూరల్: భద్రంగా కాపాడి వాటిని గుర్తించిన స్థలంలో నాటాల్సిన హరితహారం మొక్కలను అలా వదిలేశారు. వేములవాడ మార్కెట్ కార్యాలయంలో ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలను ఓ మూలకు పడేయడం అవి రోజు రోజుకు ఎండిపోతున్నాయి.

పేదలకు వరం కల్యాణలక్ష్మి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

రుద్రంగి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ గంగం స్వరూపారాణి ఆధ్వర్యంలో తోట ఆగయ్య, వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి ఆధ్వర్యంలో మానాలలో లబ్ధిదారులకు 72 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్రంగి తహశీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శంకర్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

91 మందికి చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఆగయ్య

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన 91 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి శుక్రవారం అందజేశారు.

వేములవాడ మండలంలో..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక, చింతల్‌ఠాణా, శాభాష్‌పల్లి, చీర్లవంచ, కొడుముంజ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్, ప్రమాద బీమా, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి శుక్రవారం అందజేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ముస్తాబాద్: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు కోరారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూఢనమ్మకాలు, డ్రంకెన్ డ్రైవ్, గల్ఫ్ దేశాల వీసా మోసాలు, బాల్యవివాహాలు, సైబర్ నేరాల తీరును ఆటపాటలతో సతీష్ చరణ్ కళాబృందం వివరించింది. రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ వనజ, ఉపసర్పంచ్ సంధ్య, హెచ్‌సీ భూమయ్య, సతీష్, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం



కరాటే విద్యార్థులతో అతిథులు

వేములవాడ: వేములవాడ ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కరాటే విద్యార్థులకు మాస్టర్ మన్నాన్ శుక్రవారం బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్షల్లో నెగ్గిన విద్యార్థులకు డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దారు రాజు, టౌన్ సీఐ వెంకటేశ్, జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కొండ దేవయ్య సర్టిఫికెట్లు, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బింగి మహేశ్, సిరిగిరి చందర్, జోగం శంకర్, మారం కుమార్, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి, కరాటే మాస్టర్లు నాంపల్లి విజయ్, సుద్దాల శ్రీనివాస్, అవధూత రజనీకాంత్, కూరగాయల శ్రీనివాస్, రాజశేఖర్, అనుగుల వర్షిత్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌పై దృష్టి సారించాలి

ఎల్లారెడ్డిపేట: రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఎక్కువ కాలం ఉండే ఆయిల్ పాం పంట సాగుపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి చాద భూంరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం ఆయిల్ పామ్ పంటపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. సుమారు రెండెకరాల భూమి ఉన్న రైతులు ఈ పంట సాగు చేసుకోవచ్చని, అధిక నీరు కలిగి ఉన్న రైతులు ఈ పంటను సాగు చేసుకోవచ్చాన్నారు. ఈ పంట ఒక్కసారి నాటితే కొన్నేళ్ల వరకు ఉంటుందన్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ తిరుపతిబాబు, రైతులు పాల్గొన్నారు.

కమిటీలతోనే పార్టీ బలోపేతం

ఎల్లారెడ్డిపేట: గ్రామాలలో నూతనంగా కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కమిటీలు వేశామన్నారు. మిగతా గ్రామాల్లో ఈనెల 26లోపు గ్రామ, మండల, మహిళా ఎస్సీ, ఎస్టీ, బీసీ అనుబంధ సంఘాలకు కమిటీలు కమిటీలు వేస్తామన్నారు. నాయకులు రాజునాయక్, రాములు పాల్గొన్నారు.

ఫలించిన సైజింగ్ కార్మికుల పోరాటం

- ఒక్కో కార్మికుడికి రూ. 800 పెంపు

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్లటౌన్: సైజింగ్ కార్మికుల ఇరవై రెండు రోజుల పోరాటం ఫలించింది. కార్మికులు చేపడుతున్న కూలీపోరుపై శుక్రవారం 'సాక్షి'లో 'పెరగని కూలీ..కడుపులు ఖాళీ' పేరుతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు, యజమానులు స్పందించారు. యజమానులు కార్మికులతో కలిసి నూతన కూలీ ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.800 చొప్పున పెంచడానికి అంగీకరించారు. రాబోయే రెండేళ్ల వరకు ఈ కూలీ ఒప్పందం అమల్లోకి వస్తుందని యజమానులు, కార్మిక నాయకులు తెలిపారు. నూతన కూలీ ఒప్పందంపై జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వొల్లాల కిషన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: సింగిల్‌విండో పరిధిలోని రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. రూ.5 లక్షలతో నిర్మించే కొలనూర్ సింగిల్‌విండో కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అందుబాటులో ఉండి రుణాలు తదితర సేవలను త్వరితగతిన అందించాలన్నారు. అలాగే ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్ రావు, సర్పంచులు తుమ్మల యమున, సంతోష్, ఎంపీటీసీ మల్లేశ్, సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ సర్సయ్య, వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్, రసమయి

సిరిసిల్లటౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడ అక్కపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి లాలా శ్రీనివాస్, ఉపాధ్యాయులు దేవదాసు, రాజు, రవి, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం కొలనూర్ సింగిల్‌విండో క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు, వైస్‌చైర్మన్ కాశవేణి మహేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: టీఎస్‌టీటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఈవో రాధాకిషన్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకావత్ శర్మన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు హజునాయక్, ప్రధాన కార్యదర్శి మదన్‌లాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'కు ఏర్పాట్లు పూర్తి

సిరిసిల్లఅర్బన్: ఈనెల 18న ప్రారంభంకానున్న కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 26 కంటి వెలుగు స్క్రీనింగ్ బృందాలను నియమించామని అన్నారు. రెండు మున్సిపాలిటీల్లోని 67వార్డుల్లో, 255 గ్రామ పంచాయతీల్లో క్యాంపులు నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. 24,034 రీడింగ్ కళ్ల అద్దాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కంటి వెలుగు క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్, రేషన్ కార్డ్, మొబైల్ నంబర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీధర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటి వెలుగుపై అధికారుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, కంటి వైద్యనిపుణులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కోనరావుపేట: మండలం మర్తనపేట గ్రామానికి చెందిన గుమ్మడి ప్రసాద్ ఆకస్మాత్తుగా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.13,500 ఆర్థికసాయాన్ని సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్రిపెల్లి పర్శరాములు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.